


మూరగంట ఆగవలసిన సర్కార్ ఎక్స్‌ప్రెస్ పూర్తిగా ఒకగంట సేపు విజయవాడ స్టేషనులో ఆగి, తాపీగా ఒకటిన్నరకి బయల్దేరి వెడుతూంది. క్రిందటి రాత్రి నుంచీ స్లీపరుకోచిలో మద్రాసు నుంచి, ప్రయాణం చేస్తున్న శేఖరం 'అమ్మయ్య' అనుకున్నాడు. అయినా రైలు ఐదు గంటలు లేటా? సింగరాయకొండ వద్ద ఏదో గూడ్సుబండి బోల్తా పడిందని నాలుగు గంటలు ఆలస్యమయింది కాక తరవాత. యింకో గంట చేర్చుకుంది యీమధ్యలో. మద్రాసులో యెక్కేటప్పుడు యెంత వుత్సాహంగా వుంది! ఆరోజే శేఖరు పెళ్లి కాకినాడలో జరుగబోతూంది. రాత్రి యేడు గంటలకు ముహూర్తం. ఆఫీసు పనిలో అన్నాళ్లూ నిమగ్నుడై సరిగ్గా ముహూర్తం రోజు చేరవచ్చు కదా అని క్రిందటి రాత్రి సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో యెక్కాడు. కానీ మూడున్నరకి కాకినాడ చేరవలసిన రైలు పన్నెండు గంటలప్పుడు యింకా గుంటూరులోనే యేడుస్తూంటే గాభరాపడి గార్డు వద్దకు పరుగెత్తుకుని వెళ్లి అడిగాడు. 'మాస్టారూ, కనీసం యేడు గంటలకైనా కాకినాడ చేరుతుందా?' అని.

'చెప్పలేం, మాస్టారూ. మధ్యలో ఒక గంట గెయిన్ చెయ్యొచ్చు. ఏడు గంటలకి కాకినాడ చేరుతుందనే నా నమ్మకం' అన్నాడు గార్డు. రాజకీయాల్లోంచి బ్రతుకలేక బయటపడి రైల్వే వుద్యోగం చేస్తున్న వాడి ధోరణిలో.

త్వరలోనే గుడివాడ వచ్చేసింది. 'మేము ఆంధ్రులం' అంటే 'మేమూ ఆంధ్రులమే' అన్నట్లుగా జనం కేకలు వేసుకొంటున్నారు. ఒకటే గోల. ఎక్కేవాళ్లూ, దిగేవాళ్లూ, కింద పడేవాళ్లూ, టీ అమ్మేవాళ్లూ, సోడా తాగేవాళ్లూ, కిళ్లీ నములుతూ ప్లాటుఫారమంతా ఖరాబు చేసేవాళ్లూ వందల కొలది జనం. కాసేపట్లో కోలాహలం తగ్గింది. రైల్లోని పాత ప్రయాణీకులు ఆగంతకుల్ని కుశలప్రశ్నలు వేస్తున్నారు. రైలు గుడివాడ స్టేషను వదలి వెళ్తూంటే ఏదో జ్ఞాపకం వచ్చింది శేఖరానికి.

సుశీలను గుడివాడలోనేగా యిచ్చారు? ఆమెభర్త యెవరో సినిమా థియేటర్ ప్రొప్రయిటర్ అనీ, బాగా డబ్బున్నవాడనీ గిరి ఒకసారి చెప్పాడు. గిరి వాళ్ల వూరు గుడివాడ దగ్గరే. యూనివర్సిటీలో చదువుకునేటప్పుడే సుశీలంటే తనకు ప్రాణం అని గిరి

చెప్తూండేవాడు. "మీ ప్రేమ దేవదాసు పార్వతుల ప్రేమలాంటిదోయ్, కానీ యీ కేసులో పార్వతి అభిప్రాయం మాకు బొత్తిగా తెలీదు' అని గిరితో చెప్పేవాడు తను. చదువుపూర్తయాక ఒక సంవత్సరానికి విజయవాడలో కనిపించి గిరి చెప్పాడు— సుశీలకి పెళ్లయిందనీ గుడివాడలో బాగా డబ్బున్నతనికి యిచ్చారనీ. ఆ అమ్మాయిని చేసుకున్న ఆరు నెల్లకే అతను యింకో పెళ్లి చేసుకున్నాడట! సుశీలకేం తక్కువనీ? చక్కటి విగ్రహం, మేలిమి బంగారు ఛాయ. ఎప్పుడూ గర్వంగా నవ్వుతూ వున్నట్లు కనిపించే పెద్ద కళ్లు. అందరితోనూ గలగలా నవ్వుతూ మాట్లాడేది. చాలా మంచి మార్కులు కూడా వచ్చేవి. అందరితో కలిసి చక్కగా మాట్లాడినా యెవరికీ అందనని చాటుతూన్నట్లుగా అనిపించేదామె ధోరణి. అందరికీ అందని ద్రాక్షపండు లాగా వుండే సుశీలను పొందిన ఆమె భర్త యింకో కర్ని పెళ్లి చేసుకున్నాడు. గిరి చెప్తూంటే నమ్మలేకపోయాడు శేఖరం. ఎప్పుడూ, కళ్లల్లో గర్వం తొంగిచూసే సుశీల యిప్పుడెలా వుంటుందో? ఊహించలేకపోయాడు శేఖరం.

పచ్చటి పొలాలు, కొబ్బరిచెట్లు, తాటి తోపులూ ధాన్యానికే అన్నపూర్ణ అయిన ఆంధ్రదేశం కన్నులపండువుగా వుంది. గోదావరి కాల్వల్లో పడవల్ని, గాలి లేకపోటం వల్ల తెరచాపలు తిన్నగా నుంచున్నాయి. ఏటు వైపు పడవలు కదుల్తున్నాయో తెలీటంలేదు. భీమవరం వచ్చింది. సుజాతది భీమవరమే. యూనివర్సిటీలో చదువుతున్నప్పుడు ఎంతో అమాయకంగా కన్పించేది. ఎవరైనా పలకరిస్తేనే గాని మాట్లాడేది కాదు. చామన చాయ అయినా చక్కని కళ వుట్టిపడే ముఖం. చెవులకు రింగుల్నూ, సాధారణమైన దుస్తులూ. ఓ సారి హైదరాబాదులో కనిపించింది. ఎక్కడో క్లర్కుగా వుద్యోగం చేస్తున్నానని చెప్పింది. బెరుకుగా మాట్లాడింది. రెండు మాటలు మాట్లాడేటప్పటికి 'వస్తానండి' అని నమస్కారం చేసి వెళ్లిపోయింది. ఆమె ప్రవర్తనకు కొంచెం ఆశ్చర్యపడినా, 'ఆడపిల్లకి వాతో మాట్లాడే విశేషాలేముంటాయి' అని తనకు తాను సమాధానం చెప్పుకున్నాడు. తిరువాత ఎ. జి. ఆఫీసులో పనిచేస్తున్న సోమసుందరం చెప్పాడు. సుజాత వాళ్ల వూళ్లోని ఒకబ్బాయితో లేచిపోయి హైదరాబాదు వచ్చేసిందని. ఆ అబ్బాయికి ఏదో ఆఫీసులో గుమాస్తా వుద్యోగం దొరికిందనీ, గడవటం కష్టమై తను కూడ వుద్యోగం చేస్తున్నదనీ. నమ్మలేకపోయాడు శేఖరం. 'నమ్ము, నమ్మకపో, నేను చెప్పిందల్లా అక్షరాలా నిజం. వాళ్లిద్దరూ యింతవరకూ పెళ్లి కూడా చేసుకోలేదు. కావలిస్తే వాళ్ల ఆఫీసులో పనిచేసే వాళ్లని అడుగు.' అన్నాడు సోమసుందరం. అంత మెత్తగా నెమ్మదిగా వుండే సుజాత యింత చేసిందంటే మరీ విచిత్రంగా తోచింది శేఖరానికి. సుజాత యిప్పుడెక్కడుందో? వాళ్లిద్దరూ పెళ్లి చేసుకున్నారో లేదో? ఆలోచనలో మునిగిపోయాడు శేఖరం.

రైలు వేగంగా పరుగెత్తి తణుకు చేరింది. ఇక్కడే చక్కెర ఫ్యాక్టరీలో ఆనందరావు పని చేస్తున్నాడు. కాలేజీ వదలిన మూడు నెల్లకే పెళ్లి చేసుకున్నాడు. బందరులో జరిగిన పెళ్లికి తను కూడా హాజరయ్యాడు. మంచి కట్నం, చక్కని అమ్మాయి. రతీమన్మధుల్లాగా వున్నారన్నారందరూ. ఆనందరావు అదృష్టానికి తను కూడా మురిసిపోయాడు శేఖరం. చదువు పూర్తయినవెంటనే మంచి వుద్యోగం. సలక్షణమైన అమ్మాయితో పెళ్లి. తనకు తెలిసిన అదృష్టవంతుల్లో ఒకడు ఆనందరావు అనుకున్నాడు. పెళ్లయ్యాక సంవత్సరానికి కాబోలు మద్రాసులో కనిపించాడు ఆనందరావు. మనిషి మునపటి లాగా వుత్సాహంగా లేడు. బాగా చిక్కిపోయాడు. కంపెనీ పని మీద మద్రాసొచ్చాననీ చెప్పాడు. భార్యా, పిల్లలూ (అయివుంటే) కుశల మడిగాడు శేఖరం. ఆనందరావుకు నోటమాట రాలేదు. అతికష్టం మీద తరవాత చెప్పాడు. తన భార్య ఆత్మహత్య చేసుకున్నదని, కారణం తనకు బొత్తిగా తెలీదనీ. కాపురానికెళ్లాక యెప్పుడూ యేదో దిగులుతో వుండేదట.. సరిగా మాట్లాడేది కాదట. ఇంత ఘోరం తలపెడ్తుందని తనెప్పుడూ అనుకోలేదని తల బాదుకున్నాడు ఆనందరావు. మళ్లీ యెప్పుడూ కనిపించలేదు ఆనందరావు. పెళ్లి పత్రిక పంపించాడు తణుకు అడ్రసుకు. బహుశా రావచ్చు ననుకున్నాడు శేఖరం.


నిడదవోలు దాటేప్పటికి ఆరున్నరయింది. మనసు బాగా కలవర పడిపోతూంది. ఏడు గంటలకు ముహూర్తమయితే తొమ్మిది గంటలకు వెళ్తే యేంలాభం? అయినా ఒక్కరోజు ముందుగా బయల్దేరి వెళ్లాల్సింది. ఇప్పుడనుకుని యేం ప్రయోజనం? ఈ పెళ్లి తన కసలు యిష్టమేనా? ఈ ప్రశ్న అతనికి మొదటిసారిగా స్ఫురించింది. పెళ్లి చేసుకోమని తల్లిదండ్రులు బంధువులూ, కొందరు మిత్రులూ అంతా చేరి ఒకటే గోల! నీకేం, వుద్యోగం చేస్తున్నావు, లక్షణంగా పెళ్లి చేసుకోక?' అని ప్రతి ఒకరూ అడగటమే. ఇష్టం లేకుండానే అమ్మాయిని చూసి వచ్చాడు కాకినాడలో. తనకి నచ్చలేదని చెప్పినా, మంచి కుటుంబం అనీ, యిలాంటి సంబంధం మళ్లీ దొరకదనీ పట్టుబట్టారు తల్లీ, తండ్రీ. పోనీ చేసేసుకుంటే యీ గొడవంతా తప్పిపోతుంది. మళ్లీ యిలా అడగరుగా అని ఒప్పేసుకున్నాడు, కాని పెళ్లి కోసం సెలవు తీసుకోటం తన కిష్టంలేదనీ, ఆదివారం రోజు వచ్చేట్లుగా ముహూర్తం యేర్పాటు చేయాల్సిందనీ తండ్రితో వాదించి యెలాగైతేనేం వప్పించాడు. శనివారం రాత్రి మద్రాసులో రైలెక్కి సరిగ్గా ముహూర్తం వేళకు చేరుకోవాలని ప్రయాణం కట్టాడు.

తొమ్మిది గంటలకి కకినాడ చేరితే తన కోసం ముహూర్తం నిలుస్తుందా యేమిటి? సరిగ్గా శాస్త్ర ప్రకారం ముహూర్తానికి చేసుకున్న పెళ్లిళ్లే అలా యేడుస్తూంటే, తను రెండుగంటలు ఆలస్యంగా వెళ్లి చేసుకుంటే యెంతమాత్రం అపేక్షించగలదు? (తన)పెళ్లికూతురు జ్ఞాపకం వచ్చింది. అందంలోనూ, చదువులోనూ సుశీల, సుజాతల కన్నా తక్కువే. ఆనందరావు భార్యతో పోల్చటానికే వీలుకాదు. పాపం యెన్ని కలలు కంటుందో తనను గురించి, భవిష్యత్తును గురించి. అయినా యెందుకు కలలు కనాలి? పెళ్లి చేసుకోటం మంచికే అని యెందు కనుకోవాలి? సుశీల, ఆనందరావుల జీవితాలు యేమయ్యాయి? తనెంత మంది జీవితాలు మంట కలవడం చూడలేదు? వినలేదు? చీకాకు పడుతున్నాడు శేఖరం. రైలు గోదావరి వంతెన పైకి వచ్చేసింది. రైల్లో ఒకాయన ఎదుటివాడికి వరూధిని ప్రవరాఖ్యుల కథ అతి రసవత్తరంగా చెప్తున్నాడు. ఎదుటి బెంచీలో అందరూ ఊ కొడుతూ మధ్యలో




తరతరాలు మూసి మోసపోవద్దు

దర్‌బార్ కాజల్ (రిజిస్టర్డు)



కండ్ల అందానికి

రక్షణకు

రాంబీర్ కంపెని, బొంబాయి-4 BR.

దర్‌బార్‌గంధ్ మరియు కాజల్ తయారుచేయువారు.

ఇప్పటి నుంచి తప్పక పరిశుభ్రకరమైన, ఆరోగ్యకరమైన స్నానానికి—వాడండి.

కొత్త

పెద్దది, ఎఱ్ఱనిది నహాన్

క్రెసిల్‌తోగూడినది

ఇప్పటి నుంచి మీరు కొత్త పెద్దది, ఎఱ్ఱనిది, నహాన్‌తో ఆనందంగా రోజూ స్నానం చెయ్యండి. ఈ పెద్దది, ఎఱ్ఱని స్నానపు సబ్బులో, మీకు అన్ని టపిమించిన పరిశుభ్రకరమైన, ఆరోగ్యకరమైన స్నానమును సమకూర్చే క్రెసిల్ వున్నది! రోజూ నహాన్‌తో స్నానం చెయ్యండి: అది ఆరోగ్యకరమైన అలవాటు, మరిగుర్తుంచుకోండి: నహాన్ పెద్దది—చాలా ఎక్కువ ఆరోగ్యకరమైన స్నానములకు పనికివచ్చును.





# సర్కార్ ఎక్స్‌ప్రెస్

'ఐలే ఐలే' అంటున్నారు. మెచ్చుకుంటున్నారు.

గోదావరి స్టేషను. మళ్లీ గోల. ప్లాటుఫారం మీద పెద్ద పెద్ద అంగలు వేస్తూ గబగబా నడిచి పోతున్నాడు సుబ్బరాజు. చాలా రోజులకి కనిపించాడు. వీడెక్కడున్నాడో తెలియదు. తెలిసుంటే పెళ్లి పత్రిక పంపించి వుండేవాడు. కేకేసి పిలిచాడు శేఖరం. వేగంగా నడుస్తూ పెట్టె వద్దకు వచ్చాడు సుబ్బరాజు, 'ఏం గురూ, చాలా రోజులకి దర్శనం. ఎక్కడికీ ప్రయాణం?' అంటూ. తన పెళ్లి సంగతి చెప్దామనుకున్నాడు శేఖరం అయినా యింకేం పెళ్లి? ముహూర్తం కాస్తా దాటిపోయాక పెళ్లికి పిలవడమేమిటి?

'కాకినాడ దాకా, పూరికేనే' అన్నాడు.

సుబ్బరాజు యెప్పుడు మాట్లాడినా ఒకే విషయం మాట్లాడతాడు. ఇంకో నిముషం ఆగితే రైలు వెళ్లిపోతుందనేమో' వెంటనే మొదలెట్టాడు.

'శాంత వచ్చింది'

'ఎప్పుడు?'

'ఒక నెలనుంచి యిక్కడే వుంటోంది.'

'.................'

'నిన్ను గురించి రెండుమూడు సార్లు అడిగింది మద్రాసులో వున్నారని చెప్పాను. మళ్లీ యెప్పుడైనా వస్తారా అని అడిగితే తెలీదని చెప్పాను.'

'.................'

'నిన్ను చూస్తే చాలా సంతోషిస్తుంది. నన్ను చూసినప్పుడల్లా నువ్వే జ్ఞాపకం వస్తావుట కనిపిస్తే తప్పక రమ్మని చెప్పమంది.

'...... ......'

'చాలా మంచివారామేస్టారు అంటూ ఉంటుంది'

'వెళ్దాం పద' అని సూట్‌కేస్ పట్టుకుని గబుక్కున దిగి సుబ్బరాజుతో కలిసి స్టేషను బయటికి నడిచి వెళ్లాడు శేఖరం.

అయిదు గంటలు లేటయినా సర్కార్ ఎక్స్‌ప్రెస్ బరువుగా కదలి సాగిపోయింది గమ్యస్థానం వైపు ●